



పోష్టాఫీసు వరండాలో అడుగు పెట్టాడు రాజేశ్వరావు. కుడిచేతి ప్రక్కవున్న కౌంటర్ కేసి నడిచాడు.

కౌంటర్ దగ్గిర నలుగురు అమ్మాయిలు నించుని ఏవో కొనుక్కుంటున్నారు వాళ్లు వెళ్లిపోయింతరువాత వెళ్లొచ్చుననుకుని గోడకి జారబడి నిలుచున్నాడు

ఇప్పటికే ఆలస్యం అయింది. మరిచే పోయాడు తానింతవరకూ...నిన్ననే ఉత్తరం రాయవలసింది. ఉన్న బంధువూ, కబురు తెలిసి కన్నీటిచుక్క కార్చవలసిందీ మావయ్యొక్కడే ...

ఉన్నట్టుండి, ఆ నలుగురిలోనూ ఒక అమ్మాయి ఎందుకో గాని ఫక్కున నవ్వింది. మిగతావాళ్లూ నవ్వేరు. విసుగ్గా చూసాడు. వికారంగా వున్నాయి వాళ్ల నవ్వులు .. అందులో ఒక అమ్మాయి ఎర్రని చీర కట్టుకుంది ... మంటల దారాలతో మంచి పనివాడు నేసినట్టున్న చీర.

కొంచెం దూరంలో వున్న నిలువెత్తు ఎర్రని లెటర్‌బాక్సు నిలువునా ఎండ పడి నిప్పుల కుప్పలాగ క్రూరంగా మెరుస్తున్నది... ఇంకా మంటలు రగులుతూ, పొగలు చిమ్ముతూన్న చితి, కళ్లముందు భయానకంగా కదులుతూనే వుంది.

ఆ మంటల అలల చివర్న, ఆ పొగల పల్లకీ మీద, ఎవరు చప్పుడు కాకుండా ఆకాశంలోకి వెళ్లిపోతున్నది ? వడలిన వళ్లు ...జీవిత మంతా కనబడని మంటలకి కాలిపోగా బూడిదగా మిగిలిన తెల్లటి జుత్తు ... ఎప్పుడూ చెమ్మగా వుండే అలసిన కళ్లు ... అమ్మేకదూ ... అవునది అమ్మ ...

ఇప్పటికి గామోసు సుఖపడింది అమ్మ! ఇక, కన్న కొడుకు పస్తులు పడుక్కుంటే కళ్లనీళ్లు పెట్టుకోనక్కరలేదు ... పోయిన వాళ్లూ, ఇంకా పుట్టని వాళ్లూ ఇద్దరే సుఖపడతారా లోకం మొత్తం మీద ? మగ దిక్కు లేకుండా ఎలాగ ఒక్కతే తనని పెంచి పెద్దజేసింది ?

ఒక్కతే ఎలాగ పళ్ల బిగువున ప్రాణాలు నిలబెట్టుకుని, ఎన్నెన్ని కష్టాలు పడి తనకీ మాత్రం చదువయినా చెప్పించింది ... తనకి ఏదో ఒక ఉద్యోగం దొరికి, తాను గుండెల మీద చెయ్యేసుకుని కంటి నిండా నిద్రపోతే చూడాలని ఆ పిచ్చి ప్రాణం ఎంతలాగ పరితపించింది ... ? చిన్నప్పుడే పోయాడు నాన్న. అమ్మ తోడబుట్టిన ఒక్కడూ కడుపు చేతబట్టుకుని తిరిగి తిరిగి మదరాసులో తల దాచుకున్నాడు. ఇంకెవ్వరూ లేరు. అమ్మే తోడూ, నీడా అయి, దీపమయి, దేవతలా తననిన్నాళ్లూ కంటికి రెప్పలా కాచుకుని...ఇప్పుడు తనే వెళ్లిపోయింది.

పూల చెట్టింకా, తొలి మొగ్గ తొడగనే లేదు, తోట మాలీ ఎక్కడికో శాశ్వతంగా వెళ్ళిపోయాడు. ఒక్కసారి...ఒక్కసారిగా తాను వడగాడ్పులాంటి దుఃఖానికీ, అంతులేని కష్టానికి 'ఎక్స్‌ప్రెజ్'యాడు.

ఊపిరి ఆపేసి. చూపు నిలిపేసి, చైతన్య విహీనమయిన అమ్మని కడసారి యాత్రకి సాగనంపటానికి కూడా అశక్తుడయేడు తాను. ఆ చీకటిలో చిరుదీపమయి తోచాడు ప్రకాశం. ఆక్షణాన వాడే లేక పోతే ఏమయేదో తనస్థితి? ఎక్కణ్ణించి తీసుకొచ్చాడో, తెచ్చి జేబులో పెట్టి..."రాజూ! ఈడబ్బంతా నీకూ నాకూ, చివరిదాకా అమ్మకీ అసహ్యమే... కాని నిజం ఏవిటంటే, మనం మన బీదరికాన్ని అసహ్యించుకోలేక డబ్బుని అసహ్యించుకుంటాం. ఎక్కణ్ణించి తీసుకొచ్చానని మాత్రంఅడక్కు.. అమ్మకోసం మనం పెట్టే చివరి ఖర్చుకి ... చివరి ఖర్చుకి. ." అన్నాడు ప్రకాశం.

అన్నీ అవగా మిగిలింది...పది పైసలు...

మువ్వ పగతో రగులుతూ వుందు.

నిరాశతో క్షణానికోసారి, మానసికంగా చస్తూ వుండు, ఆశల ఇంద్ర ధనుస్సులను సృష్టించి, వాటితో కోర్కెల నక్షత్రాలని ఒక్కొటొక్కటిగా, నేలరాలుస్తూ వుండు. చివరికి నిన్ను నేలమీదికి, నిజం కత్తి దారు మీదకి లాక్కొచ్చి నిలబెట్టేది–ఆకలి !

ఆకలేస్తే ఉన్న పది పైసలూ పట్టుకుని టీకొట్టుకి వెళ్లేడు నాచుబుడగలాగ నించొని వున్నదా పాక కుళ్లు కాలువప్రక్క. టీ చెయ్యమని చెప్పి కర్రబెంచీ మీద కూచున్నాడు ఆ బెంచీ నిండా మరకలు, మచ్చలు, పొరలు పొరలుగా మురికి . దాన్నిచూస్తే తనకెందుకో గాని మళ్లీ తన బతుకే జ్ఞాపకం వచ్చింది... తను...అమ్మ . ప్రకాశం . మావయ్య . హఠాత్తుగా అప్పుడు జ్ఞాపకం వచ్చింది మావయ్యకు ఉత్తరమే రాయలేదు...రాయలేదు...ఉన్న పది పైసలూ పెట్టి 'టీ' తాగేస్తే ఎలాగ? తీసుకొచ్చిన టీ ఒద్దనేసి లేచి బైటకి వచ్చేసాడు.

తనకి జ్ఞాపకం వచ్చిన తరువాత మొత్తం మీద ఏ మూడు నాలుగు సార్లో ఇక్కడికొచ్చి, చూసి వెళ్ళేడు మామయ్య ... ఇసుక దిబ్బల అడుగున ఏ మైలులోతునో, చక్కని తీపినీటి బుగ్గ అణిగి పడున్నట్టు, దరిద్రం మాటున బంధుత్వాలూ, అభిమానాలు కప్పబడి పోతాయి...

అమ్మాయిల నవ్వులతో మళ్ళీ యదార్థం లోకి వచ్చేడు రాజేశ్వరరావు ...

"పదవే... నీకోసం జంక్షన్లో బీటేసిన అబ్బాయిలు బెంగపెట్టుకు పోతారు......" నీలిచీర అమ్మాయి అంటోంది ... మళ్ళీ నవ్వులు, అసహ్యంగా...సిగ్గులేకుండా...వాళ్ళు వెళ్ళిపోతూ రాజేశ్వరరావుకేసి చులకనగా చూసి

వెళ్ళిపోయారు...

వాళ్ళు మెట్లుదిగి పోయేవరకూ అలాగే వున్నాడు రాజేశ్వరరావు తరువాత తేలికగా ఊపిరొదిలి జేబులో చెయ్యిపెట్టి చూసుకున్నాడు... పదిపైసల బిళ్ళ జేబులోనే వుంది... నెమ్మదిగా కదిలి కిటికీదగ్గర కెళ్ళి నించున్నాడు.

కిటికీ వెనకాల కౌంటర్ దగ్గర కూచున్నతను వెనక్కి వాలి మరీ వెళ్ళిపోతున్న అమ్మాయిల కేసి చూస్తున్నాడు.

''సార్''పిలిచాడు నెమ్మదిగా రాజేశ్వరరావు.

కౌంటర్ దగ్గిర గుమాస్తా చూపన్నా మరల్చలేదు.

రెండు క్షణాలాగి మళ్ళీ పిలిచాడు''సార్''

''ఊ...'' కౌంటర్ దగ్గిరతను ఖాళీగా చూసాడు రాజేశ్వరరావు వేపు. అతని కళ్ళలో కూలిపోతున్న రంగుల మేడలు అప్పుడే చిగురు పెట్టిన మొక్కలు. అంతలోనే వాడిపోతున్న చిత్రాలు... సుందరమైన సంగీతం కలిగించిన అనుభూతులూ, భ్రమలు, ఒక్కొక్కటే మాయమవుతున్న దృశ్యాలు... కొన్ని క్షణాలు పట్టిందతగాడికి మళ్ళీ వాస్తవంలోకి రావడానికి...

# పది పైసలు

''ఏవండీ?'' విసుగ్గా కసిరినట్టడిగాడు...

''కార్డు కావాలండీ'' బెరుగ్గా అడిగాడు రాజేశ్వరరావు.

''కార్డుకావలిస్తే డబ్బులివ్వండీ'' అతనికి రాజేశ్వరరావుమీద కోపంగా వున్నట్టుంది.

రాజేశ్వరరావు జేబులోనుంచి పదిపైసలు తీసి, కిటికీలోనుంచి అందించాడు. ''పోస్టు కార్డు కావాలండీ...''

''పోస్టు కార్డా... ఇదేవిటి? పదిపైసలిచ్చారు...మరో అయిదు పైసలివ్వండి...'' అతను మొహం విసుగ్గా పెట్టాడు...

''ఎందుకండీ?''అయోమయంగాఅడిగాడు రాజేశ్వరరావు.

''కార్డు పదిహేను పైసలండీ బాబూ. ఖరీదులు పెరిగినాయి కదా ... కొంపదీసి మీదాకా రానేలేదేమిటి భోగట్టా...''

''ఔనవును...మర్చేపోయాను...తెలుస్తెలను...తెలిసే మర్చిపోయాను...''గొణుక్కున్నాడు

ఖరీదులు పెరిగినయ్

కనిపించని గొడ్డలి నెత్తిమీద విసురుగా పడింది,

ఆ చప్పుడూ వినబడదు...,

ఆచెక్కలూ కనబడవు ...

ఆనెత్తురూ కనిపించదు...

ఖరీదులు పెరిగినయి ... పెరిగినయి... గొణుక్కున్నాడు

''మరో అయిదు పైసలివ్వండి...లేకపోతే మీ పది పైసలూ మీరు తీసుకోండి...'' కౌంటర్దగ్గరతను అన్నాడు

కిటికీలోనుంచి పది పైసలూ తీసుకున్నాడు రాజేశ్వరరావు.

''ఎక్కడిదీ.. మరోఐదు పైసలూ ?''

చెయ్యి విప్పి పది పైసలకేసి చూసాడు...

విలువచచ్చి, పదిపైసలు బిళ్ల శవంలాగ చేతికి తగులుతోంది చల్లగా ..ఈ పది పైసల కోసమేనా ఇందాకట్లా మెట్లదగ్గర ముసలమ్మ కాళ్ళా వేళ్ళా పడింది

పది పైసలకేసి చూస్తూనే వెను దిరిగాడు రాజేశ్వరరావు. విలువ చచ్చింది...మనిషికా, పది పైసలకా? దేనికి.. అమ్మా ..మావయ్యకి నీ భోగట్టా రాయడానిక్కూడా ఈక్షణాన్న నేను చాతకాని వాణ్నయానమ్మా ..ఒళ్లు ఝల్లుమంది రాజేశ్వరరావుకి ..

చేతిలోని పది పైసల బిళ్లజారిపడి దొర్లుకుంటూ మెట్లు మీద నుంచి కింద ఇసుకలో పడింది

మెట్లుదగ్గిరకూచున్న ముసలమ్మ ఆత్రంగా చేయిచాచి ఆ పది పైసలూ పదిలంగా గుప్పిట్లో దాచుకుంది

అయ్యయ్యో...పది . పది పైసలు...టీ తాగొచ్చు మరో అయిదు పైసలు ఎక్కడో సంపాదించి మావయ్యకు ఉత్తరం రాయొచ్చు ... అయ్యయ్యో పడిపోయింది ... ముసల్ది కాసుక్కూచున్నట్లు తీసేసి దాచేసుకొంది ...

గబగబా మెట్లు దిగాడు రాజేశ్వరరావు.

''నా పది పైసలిలాగ ఇచ్చీ ... '' ఎలాగ అడిగాడో తనకే తెలీదు

ముసలమ్మ తలెత్తి రాజేశ్వరరావు కేసి చూసింది

తెల్లబడ్డ తల . జీవితాన్ని చూసి జడుసుకూని, తనలోకి తానే ముడుచుకు పోగా ముడతలు పడ్డ వొళ్లు ..చెమ్మతో, దిగులుతో బరువుగా, నీరసంగా వున్న కళ్లు ... ఆ మొహంలోంచి మరో మొహం తనకేసి చూసినట్టయి ...

మరోమాట మాటడలేక తలొంచుకుని ముందుకు నడిచాడు రాజేశ్వరరావు.


కళాశాలలో ప్రవేశము లభించలేదా ?

చేరండి

స్కూల్ ఆఫ్ కరస్పాండెన్సు కోర్సులో

ఆంధ్రా యూనివర్శిటీ, వాల్తేరు (ఆం. ప్ర.)

1974—75 విద్యా సంవత్సరమునకు ఈ క్రింది కరస్పాండెన్సు కోర్సులలో ప్రవేశమునకు భారతదేశంలో నివసిస్తున్న, అర్హతలువున్న అభ్యర్ధులనుండి దరఖాస్తులు కోరబడుచున్నవి దరఖాస్తులు చేరవలసిన ఆఖరుతేది 21 అక్టోబరు 1974.

| కోర్సు | బోధనా భాష |
|---|---|
| 1. 2 సం ల ప్రీ — యూనివర్సిటీ కోర్సు | ఇంగ్లీషు లేక తెలుగు |
| 2 3 సం. ల బి.ఏ డిగ్రీ | ఇంగ్లీషు మాత్రము |
| 3 3 సం. ల బి కామ్. డిగ్రీ | ఇంగ్లీషు మాత్రము |

రెగ్యులర్ విద్యార్థులకు వున్న పాఠ్యాంశములు, నిబంధనలే వీరికి కూడా వర్తించును మరియు యూనివర్సిటీచే ఒకే విధంగా పరీక్షలు జరిపి, డిగ్రీలు ప్రధానం చేయుదురు

ఆసక్తిగల అభ్యర్థులు (ప్రాస్పెక్టసు, సిలబసు, దరఖాస్తు ఫారం, ఎగ్జంప్షన్ ఫారములను రు 5—00 (ఐదు రూపాయలు) మాత్రం మని ఆర్డరుద్వారా పంపి ఈ క్రింది సంతకపు దారుని నుండి పొందవచ్చును. మని ఆర్డరు కూపను మీద ఎందునిమిత్తం డబ్బు చెల్లించినది తప్పక వ్రాయవలెను.

ప్రొఫెసర్ కె. వి. శివయ్య,

డైరక్టర్.